www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025



అనుకున్న సమయానికి శెట్టిపల్లి భూములకు పట్టాలు జారీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అనుకున్న సమయానికి శెట్టిపల్లి భూములు కొనుగోలుదారులకు, రైతులకు పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి వెల్లడించారు. శెట్టిపల్లి భూముల లేఔట్ ఏర్పాటు, పట్టాలు పంపిణీ తదితర అంశాలపై బుధవారం తుడా కార్యాలయంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అధ్యక్షతన తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ , తుడా లోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే శెట్టిపల్లి భూముల ఫ్లాట్స్ కొనుగోలుదారులకు, రైతులకు పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. లేఅవుట్ ప్లానింగ్ మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి పట్టాలను సిద్ధం చేస్తున్నామని వివరించారు. వీలైనంత త్వరలో పట్టాలు పంపిణీకి సిద్ధం అవుతున్నామని, అపోహలు వీడి ప్లాట్స్ కొనుగోలుదారులు రైతులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

ఏతా.. వాత కుండ పోత జిల్లా.. జలమయం

- ఎడతెరపి లేని వర్షాలు
- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తం
- అధికారుల సెలవులు రద్దు చేసిన కలెక్టర్
- 14 మండలాల్లో 10 సెం.మీ వర్షపాతం
- శ్రీకాళహస్తి మండలంలో 184.6 మిల్లీమీటర్లు
- సముద్రంలో చేపల వేట వెళ్లొద్దు
- రెవెన్యూ, ఇరిగేషన్ చెరువులు తెగిపోకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బంగాళాఖాతం అల్పపీడన ప్రభావం వల్ల ఇటు రాయలసీమ అటు ఉత్తర తమిళనాడులోని ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో తమిళనాడుకు ఆనుకొని ఉన్న తిరుపతి జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావం చెరువులు, కుంటలు నిండడమే కాకుండా డ్యాముల్లోకి వర్షపు నీరు ఎక్కువగా వచ్చి చేరుతోంది. చెరువులు తెగిపోకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్త మయింది. ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు తమిళనాడు రాష్ట్రానికి ఆనుకొని ఉన్న తిరుపతి జిల్లాలోని పలు గ్రామాల్లో ఉధృతంగా వర్షాలు కురుస్తుండడంతో సెలవుల్లో ఉన్న రెవెన్యూ ఇతర శాఖల అధికారులను కలెక్టర్ రద్దు చేశారు. శ్రీకాళహస్తి, వాకాడు, చిట్టమూరు, సత్యవేడు, వరదయ్యపాలెం మండల ప్రాంతాల్లో ఎక్కువగా వర్షం ప్రభావం కనబడుతోంది. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా ఉండేందుకు రెవిన్యూ యంత్రాంగంతో పాటు ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తుఫాను పరిస్థితిని అంచనా వేస్తున్నారు. చెరువులు తెగిపోకుండా ఉండేందుకు ముందస్తు చర్యలను చేపట్టారు. కాలువలకు గండ్లు పడకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. వర్షాలు వల్ల పలు రోడ్లు గుంతల మయంగా మారాయి. మరికొన్ని రోడ్లు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు.

ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి
ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మరియు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అమరావతి నుంచి హోమ్ మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా కలెక్టరేట్ నుండి ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య డిఆర్ఓ నరసింహులు సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌర్య హోం మంత్రికి వివరిస్తూ.. ఈశాన్య రుతుపవనాల ప్రభావం వలన జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బందితో బుధవారం కమిషనర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంకా రెండు రోజులు నగరంలో వర్షాలు పడే అవకాశం ఉందని, 24గంటల పాటు టోల్ ఫ్రీ నంబర్లు 0877 222356776, 9000822909 లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

యంత్రాంగం అందుబాటులో ఉండాలి
: మేయర్, జేసి అండ్ కమిషనర్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏర్పడే ఎలాంటి విపత్కర పరిస్థితులనయినా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని మేయర్ డాక్టర్ శిరీష సూచించారు. నగర ప్రజలకు ఎలాంటి ఆసౌకర్యం లేకుండా చూడాలని, ఏ సమయంలో అయినా అందుబాటులో ఉండాలన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

చేపల వేటకు వెళ్లొద్దు..

తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు నేపథంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేట వెళ్ళరాదని అధికారులు రెండు రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేశారు. మార్గ మధ్యలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనుకకు తీసుకురావాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా నాయుడుపేట, వాకాడు, గూడూరు, సుళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేశారు.

పలు పంటలకు నష్టం..

ఎడతెరపి లేని వర్షాలతో తిరుపతి జిల్లాలో పలు పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి, వేరుశనగ, అరటి వంటి పంటలను రైతులు వేశారు. మరో నెలలో పంట కోతకు వస్తున్న సందర్భంగా భారీ వర్షాలు వల్ల పంటలు మునిగి పోవడంతో రైతులు నష్టం కలిగించింది. వర్షాలు తగ్గిన తర్వాత పంట నష్టం అంచనాను వ్యవసాయ అధికారులు వేయనున్నారు.

మునిగిన అండర్ బ్రిడ్జిలు..

అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలవకుండా తగుచర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు.తిరుపతి నగరంలో బుధవారం కురిసిన వర్షాలకు డిఆర్ మహల్ అండర్ రైల్వే బ్రిడ్జి, వెస్ట్ చర్చ్ రైల్వే బ్రిడ్జి, రాయల్ చెరువు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. వర్షపు నీరు బ్రిడ్జి కింద చేరడంతో డిఆర్ మహళ్ అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి వద్ద కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు మోటర్లతో నీటిని బయటికి తోడేశారు. అలాగే వెస్ట్ చర్చ్ రైల్వే వద్ద కూడా మోటర్లు పెట్టి నీటిని పంపింగ్ చేశారు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద మురుగు ఉధృతంగా ప్రవహించింది. కొంతవరకు రాకపోకలు అంతరాయం కలిగినప్పటికీ దాన్ని నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.

14మండలాల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం

తిరుపతి జిల్లాలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో దాని ప్రభావం పది మండలాల్లో పదికి పైగా సెంటీమీటర్లతో వర్షపాతం నమోదయింది. కొన్ని మండలాల్లో 15 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. బుధవారం శ్రీకాళహస్తి మండలంలో 184.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదయింది. తొట్టంబేడులో 176.6 మిల్లీమీటర్లు నమోదు. బి ఎన్ కండ్రిగ 149.4, వడమాల పేట 141.8, దొరవారి సత్రం 143.8, ఎల్లకూరు 144.2, సులూరుపేట 135. 6 ,ఏర్పేడు 132.8, దక్కిలి 124.2, బాలయ్య పల్లి 112.4, గూడూరు 107.2, వరదయ్యపాలెం 13.2, తిరుపతి రూరల్ 108. 8,రేణిగుంట 100.6, వర్షపాతం రికార్డ్ స్థాయిలో నమోదయింది. తడ 97.8, ఏర్పేడు 132.8, సత్యవేడు 78.0, పిచ్చాటూరు 56.6, గూడూరు 107.2, నాగలాపురం 48.6, డక్కిలి 124.2, కెవిబి పురం 82.2, వాకాడు 42.4, వరదయ్యపాలెం 103.2, చంద్రగిరి 84.6, కోట 41.4, బుచ్చినాయుడుకండ్రిగ 149.4, వడమాలపేట 141.8, నారాయణవనం 60.4, చిల్లకూరు 94.2, బాలాయపల్లి 112.4, ఓజిలి 98.2, యర్రావారిపాలెం 64.0, సూళ్లూరుపేట 135.6, రేణిగుంట 100.6, వెంకటగిరి 126.6, రామచంద్రపురం 88.2, దొరవారిసత్రం 143.8, పెళ్లకూరు 144.2, తిరుపతి (గ్రామీణ) 108.8, తిరుపతి (అర్బన్) 98.4, తొట్టంబేడు176.8, చిన్నగొట్టిగల్లు 31.6, శ్రీకాళహస్తి184.6, పుత్తూరు 51.2, పాకాల 79.0, నాయుడుపేట 80.4, చిట్టమూరు 58.8 వర్షపాతం నమోదయింది.

రవాణా ఇబ్బంది తలెత్తకుండా చూడండి :
రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్

దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సంసిద్ధంగా ఉండాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. మత్స్యకారులు ఎవ్వరూ చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అప్రమత్తమవ్వండి
: తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రజలను అప్రమత్తంగా ఉండమని హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహశీల్దార్లకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తక్షణం హెచ్చరికలు జారీ చేశారు.

ఉప్పొంగిన మూల కోన జలపాతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా, మూల కోన జలపాతం మంగళవారం రాత్రి నుంచి తన ఉగ్రరూపం చూపించింది. నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరడంతో అధికారులు తాత్కాలికంగా జలపాతం వద్దకు ప్రవేశం నిలిపివేశారు.

పొంగి పొర్లుతున్న వర్షపు నీరు

వడమాలపేట మండల పరిధిలోని కల్లూరు నుండి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పూర్తిగా మూసుకుపోయింది. నీరు పారు తుండటంతో మార్కెట్ ప్రాంతాలకు వెళ్లడం కష్టంగా మారింది. పిల్లలు పాఠశాలకు వెళ్లడానికీ, రైతులు తమ పంటల వద్దకు చేరడానికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే తిరుపతి రేణిగుంట నుంచి కల్లూరు, చెన్నం పల్లి, టీసీఅగ్రహారం, కల్లూరు బీసీ కాలనీ, లక్ష్మమ్మ కండ్రిగ వంటి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోజు వారీగా జీవనోపాధి కోసం రేణిగుంట మండలంలోని ఫ్యాక్టరీలకు, ఎస్టేట్‌లకు చేరుకోవాలన్న ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చొరవ చూపి, బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
: ఎస్ఐ హరి ప్రసాద్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు శాఖ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజల పరిస్థితులు గమనిస్తున్నామని తెలిపారు. వాగులు, వంకలు, చెరువుల వద్ద స్నానాలకు, చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఎడతెరపి లేని వర్షాలతో పాడిరైతులకు పశుసంవర్ధక శాఖ అధికారులు పలు సూచనలు చేశారు. జీవాలను మేపడానికి దూరంగా తీసుకు వెళ్ల వద్దని, ఇంటి వద్ద గాని లేదా ఊరి పొలిమేరల్లో మాత్రమే మేపాలని సూచించారు.

నేటి నుంచి ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర 13వ మహాసభలు

వేమన విజ్ఞాన కేంద్రంలో మహా సభలకు ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ :ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 13వ మహాసభలు తిరుపతి నగరంలో ఈనెల 23,24 తేదీల్లో జరగనున్నాయి. తిరుపతి యశోద నగర్, వేమన విజ్ఞాన కేంద్రం ఇందుకు వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 350 మంది ప్రతినిధులు, ఏఐఆర్డబ్ల్యుఎఫ్ జాతియ నాయకులు, జాతీయ రవాణా రంగ ప్రముఖులు మహాసభలకు ఈ సభలకరు హాజరుకానున్నారు. ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ రాష్ట్ర మహాసభలకు తిరుపతి జిల్లా, జోనల్ కమిటీలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఎంఈ సేవా పథకం పేరిట బీసీసీ పద్ధతిలో ప్రైవేటు విద్యుత్ బస్సులను ఆర్టీసీల పేరుతో తిప్పనుంది. ఈపాటికి అలిపిరి డిపోలో ఉన్న 100 విద్యుత్ బస్సులు ప్రైవేట్ అద్దె బస్సులే. ఆర్టీసీలో మొదటి విడతగా వివిఈ 50 బస్సులు 12 డిపోలలో, రెండవ విడతగా 1250 బస్సులను 19 డిపోలలో తీసుకురానున్నారు. ఈ బస్సులు వస్తే రాష్ట్రవ్యాప్తంగా 31 డిపోలు మూతపడనున్నాయి. 2029 నాటికి ఇప్పుడున్న బస్సులు అన్నిటిని విద్యుత్ ప్రైవేట్ బస్సులుగా మార్చాలని జీవో నెంబర్ 88 ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి తోడు గత నెలలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పని గంటలు 8 నుంచి 10 గంటలకు పెంచాలని మహిళలు రాత్రిపూట కూడా పనిచేయాలని తీర్మానించారు. ఈపాటికి రోజుకు పదిగంటలు పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల పనిగంటలు మరింత పెంచనున్నారు. మహిళలకు ఉచిత బస్సు పేరుతో రన్నింగ్ సిబ్బందిపై రెండు గంటల పని ఇప్పటికే పెరిగింది. ఆర్టీసీలో ఉన్న 5000 మంది మహిళలు రాత్రివేళలో కూడా పనిచేయాల్సి వస్తుంది. నేడు ఆర్టీసీల విలువైన స్థలాలను నగర నడిబొడ్డులో ఉన్న బస్టాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి అనే సాకుతో కార్పొరేటర్లకు, పెట్టుబడిదారులకు బహుళ జాతి షాపింగ్ మాల్స్ పేరుతో కట్టబెడుతున్నది. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ రంగ సంస్థల ఏపీఎస్ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులదే. అటు సంస్థను కాపాడుకుంటూ ఇటు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరుబాట నడుపుతున్న ఏపీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, రాష్ట్ర 13వ మహాసభల ద్వారా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు సిద్ధమవుతుంది. గత రెండు రోజులుగా తిరుపతి వేమన్న విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం నాయకులు రాత్రి పగలు తేడా లేకుండా మహాసభల నిర్వహణ కొరకు అలుపెరగని కృషి చేస్తున్నారు. 23, 24 తేదీలు రెండు రోడ్లు పాటు జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.

ఏనుగుల హల్ చల్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలో రంగంపేట, కందుల వారిపల్లె, చిన్నరామాపురం, భీమవరం తదితర ప్రాంతాలలో గత మూడు రోజులుగా తొమ్మిది ఏనుగుల గుంపు పంట పొలాలను భీభత్సంగా ధ్వంసం చేస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఏనుగులు గుంపు చిన్న రామాపురం, భీమవరం సమీపంలోని వరి, కొబ్బరి, అరటి పంటలను ధ్వంసం చేసి ఎగువ కూచువారిపల్లి సమీపంలో రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్మెంట్ నెంబర్ 48 నాగపట్ల వెస్ట్ బీట్ లోనికి ప్రవేశించాయని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. చుట్టు ప్రక్కల గ్రామస్తులంతా భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు . సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించి. ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఈ రోజు రాత్రికి రంగంపేట, నాగపట్ల పరిసర ప్రాంతాలలో కూడా సంచరించే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ కార్మికుల దీక్షకు రైతు సంఘం మద్దతు

ప్రజాశక్తి - తిరుపతి సిటి : విద్యుత్ సంస్థలో పిసిరేట్ కార్మికులుగా పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జరుగుతున్నటువంటి రిలే నిరాహార దీక్షకు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి సంఘీభావం తెలియపరిచారు. బుధవారం కార్మికుల దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ దినసరి కూలీలుగా గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ హమాలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హేమలత మాట్లాడుతూ గత 30 రోజులుగా హమాలీలు వారి సమస్యలపై రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే, యాజమాన్యం కనీసం కనికరం చూపకుండా నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం చాలా అన్యాయమన్నారు. జోరు వానలో సైతం వారు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని, తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాలను మరింత తీవ్రతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరోగ్య దాస్ మాట్లాడుతూ ఇప్పటికన్నా తమకు న్యాయం చేయాలని లేకుంటే, తమ భార్య బిడ్డలతో సహా రిలే నిరాహార దీక్షలే తమకు శరణ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్, చిరంజీవి, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా అంబడ్స్ పర్సన్‌గా మురళి నియామకం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి, పథకం అమలులో లోటుపాట్లు, ఫిర్యాదులను పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ వారి ఆదేశాలతో తిరుపతి జిల్లాకు అంబడ్స్ పర్సన్‌గా మురళిని సెలక్షన్ కమిటీ సిఫార్సులు మేరకు నియమించినట్లు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాలలో ఉన్న ప్రతి జిల్లాకు నూతనంగా ఏర్పాటు చేసిన అంబడ్స్ పర్సన్ ద్వారా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు ఫిర్యాదులు కానీ, పథకం అమలుకు సంబంధించి మరే ఇతర సమస్యలు ఉన్నా ఈ అంబడ్స్ పర్సన్ వాటిని స్వీకరించి, వాటిపై పూర్తిస్థాయి పరిశీలన తరువాత తదుపరి నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి, స్టేట్ నోడల్ డిపార్ట్మెంట్ వారికి నివేదికలు పంపనున్నారు. ప్రతి మూడు నెలలకోసారి, ఏడాదికి ఒకసారి ఉపాధి హామీ పథకంపై వచ్చే ఫిర్యాదులు పరిశీలించి సమర్ధవంతమైన అమలు కోసం నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నారు.

చంద్రబాబును కలిసిన మయూర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ బుధవారం దుబాయ్ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు నాయుడు యువ పారిశ్రామిక వేత్తల సమ్మిట్‌లో పాల్గొనేందుకు దుబాయ్ విమానాశ్రయంకు చేరుకోగా మయూర్, కొంతమంది ఎన్ఆర్‌లు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు మయూర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

వేప చెట్టు నుంచి పాలు..! పుకార్లు నమ్మొద్దు : జెవివి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, బండారుపల్లి పంచాయతీ, వెంకటాపురంలో వేప చెట్టునుంచి పాలు కారుతున్నాయనే పుకారు పరిసర గ్రామాల్లో షికారు చేసింది. కృష్ణాపురం బత్తిరెడ్డి అనే రైతు తన పొలంలో గట్టుపై ఉన్న వేప చెట్టుకు పాలు కారుతున్నాయని పలువురికి తెలిపాడు. దీంతో పలువురు చెట్టుకు పూజలు చేయడం ప్రారంభించారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఈ విషయాన్ని ఖండించారు. చెట్ల నుంచి జిగురు కారడం సహజమని మూఢనమ్మకాలు ప్రచారం చేయొద్దని తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించండి

- భారీ వర్షాల నేపథ్యంలో అత్రమత్తంగా వుండండి
- ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలను అందించడం ద్వారా వినియోగదారుల మన్ననలు పొందేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎపిఎస్ పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి కోరారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం ఉదయం 9 సర్కిళ్ళ సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలోని 410 సెక్షన్లలో విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో వుండడం, నిరంతర విద్యుత్ సరఫరా, సరైన ఓల్టేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. విద్యుత్ సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సంస్థ పరిధిలో పునర్వ్యవస్థీకరణ విద్యుత్ పంపిణీ పథకం (ఆర్ డిఎస్ఎస్) కింద 11కెవి ఫీడర్లను, ఓవర్ లోడెడ్ 33కెవి ఫీడర్లను గుర్తించి వేరు చేసే పనులను వేగవంతం చేయాలని సూచించారు. పిఎం సూర్య ఘర్ పథకంపై జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులతో సమీక్షించి, ఈ పథకంపై వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. సంస్థ పరిధిలో పెండింగులో వున్న వర్క్ ఆర్డర్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని, వరదల కారణంగా ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో వినియోగదారుల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకు వీలుగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, తద్వారా విద్యుత్తు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అవకాశం వుంటుందని తెలియజేశారు. వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. ఆయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్ పి. సురేంద్ర నాయుడు, జనరల్ మేనేజర్ (సిఎస్సి) చక్రపాణి, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

గరుడ వారధి పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి గరుడ వారధి పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ పార్క్ ఎదురుగా గరుడ వారిది ఫ్లై ఓవర్ నుంచి 40-50 మధ్య వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తిగా దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్లైఓవర్ నుంచి కింద పడే రక్త గాయాలతో కొట్టుకుంటున్న వ్యక్తిని గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ అక్కడికి వచ్చేలోపు ఆ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సెల్ ఫోన్ లభించడంతో దాని ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల నిరసన



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు చిరు వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే లైసెన్స్ ఇవ్వాలని, గత 4 28 రోజుల నుంచి నిరసన దీక్ష చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం టిటిడి పరిపాలనా భవనం ఎదురుగా వ్యాపారస్తులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఎస్.జయచంద్ర, టి.సుబ్రహ్మణ్యలు మాట్లాడుతూ చిరు వ్యాపారస్తులు ఇంత కాలంగా నిరసన దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, టిటిడి పాలకమండలి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు అధికారులకు వినతులు సమర్పిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. 30 కుటుంబాల వారు అన్నమో రామచంద్రా అని ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబాలన్నీ వీధిన పడ్డాయని, అధికారులు కనికరించాలని కోరారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరసన దీక్ష కొనసాగిస్తున్నారని తెలిపారు. టిటిడి యాజమాన్యం తక్షణమే ఈ సమస్యను పరిష్కరించుకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి, బుజ్జి, ఉపాధ్యక్షులు వేణు గోపాల్, శ్రీవారి మెట్లు యూనియన్ నాయకులు చిట్టిబాబు, యుగంధర్, చిరంజీవి, ప్రకాష్, పెంచలయ్య, రామ్మూర్తి, మల్లికార్జున, గోపి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు పాటించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లాలో భారీ వర్షాల కారణంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ విద్యాసంస్థలకు బుధవారం సెలవుదినంగా ప్రకటించారు. వర్షాల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు గురికాకుండా కొన్నిచోట్ల బ్రిడ్జిలు తెగిపోవడంతో, కరెంటు తీగలు తెగి పడిపోయి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నందున, కొన్ని ప్రభుత్వ పాఠశాలలో పాత బిల్డింగులు కావడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ఆయన మంగళవారం రాత్రి విద్యాసంస్థలు అన్నీ కూడా బంద్ చేయాలని నోటీసు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో అన్ని రకాల విద్యాసంస్థలు బంద్ చేసినప్పటికీ, కలెక్టర్ ఆదేశాలు పాటించకుండా నారాయణ విద్యాసంస్థలు మాత్రం కలెక్టర్ ఆదేశాలను పాటించకుండా తరగతులు నిర్వహించారు. విద్యార్థి నాయకులు అక్కడ చేరుకొని ధర్నా నిర్వహించి విద్యార్థులను తరగతుల నుండి సురక్షితంగా ఇంటికి పంపించారు. కలెక్టర్ నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్ని మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ, జిల్లా సెక్రటరీ కుమార్, ఎన్ఎస్ఎస్ అధ్యక్షులు సుందరరాజు, ఓబీసీ విద్యార్థి సంఘం రాయలసీమ అధ్యక్షులు ఉత్తరాది విజయ్, బజారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నవంబర్ 3 న జరిగే మున్సిపల్ కార్మికుల రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు డి మహేష్ పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, మున్సిపల్ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొన్ని డిమాండ్లు నెరవేర్చామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చి నేటికీ ఆ సమస్యలపై పరిష్కారం చూపడం లేదన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విజయ్ కుమార్, నాయకులు యశోద్, అంకయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమలో కార్మికులకు భద్రత కరువు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం పరిధిలోని చెర్లోపల్లి గ్రానైట్ క్వారీలో పని చేస్తున్న కార్మికులకు భద్రత, వసతులు కరువయ్యాయని సిపిఐ పార్టీ పుత్తూరు మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం తాహశీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ పుత్తూరు మండల కార్యదర్శి డి.మహేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని క్వారీల్లో, గ్రానైట్ క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని, కనీస వసతులు కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐజర్‌లో ఘనంగా 'స్వచ్ఛోత్సవ్'

ప్రజాశక్తి -ఏర్పేడు: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో జంగాలపల్లి సమీపంలోనున్న ఐజర్‌లో బుధవారం 'స్వచ్ఛోత్సవ్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బందికి స్వచ్ఛతే సేవ 2025 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రమేష్ చంద్ర మాట్లాడుతూ, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణ సవాళ్లకు ఐజర్ విద్యార్థులు, శాస్త్రవేత్తలు వినూత్న పరిష్కారాలు కనుగొనాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న ప్రజా అలవాట్లతో దేశం ఎదుర్కొనే పారిశుద్ధ్య, పర్యావరణ సమస్యల పరిష్కారం మానవాళి మనుగడకు కీలకమని ఆయన తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హుస్సేన్ భక్కి, డిప్యూటీ రిజిస్ట్రార్ కుమార్ హిమాన్షు శేఖర్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీకి
అక్షర జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - నాగలాపురం: రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలకు అక్షర కళాశాల విద్యార్థి ఎస్.కె.షాహీనా ఎంపికైనట్లు అక్షర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ బుధవారం తెలిపారు. తిరుపతిలో శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ పుట్టపర్తి వారు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో నాగలాపురం అక్షర జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి షాహీనా జిల్లాలోనే మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయిలో వ్యాస రచన పోటీలకు ఎంపికైంది.

ఎస్.కె.షాహీనా

జలదిగ్బంధంలో కార్యాలయాలు, కాలనీలు

ప్రజాశక్తి - ఏర్పేడు: మండలంలోని ఇసుక తాగేలి గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. నీరు వెలుపలకు పోయే పరిస్థితి లేకపోవడంతో పంచాయతీ కార్యాలయంలో ఉన్న బ్లీచింగ్, సున్నపు బస్తాలు పూర్తిగా నీటిలో మునిగాయి. ఇసుక తాగేలి ప్రాథమిక పాఠశాల, మహిళా సంక్షేమ భవనాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

వరద ముంపులో గిరిజన కాలనీ..

ఏర్పేడు మండలం, కోబాక పంచాయతీ కుప్పయ్య కండ్రిగలోని గిరిజన కాలనీ వరద ముంపుకు గురైంది. వర్షపు నీరు ఇళ్లలోకి చేరటంతో రాత్రంతా ఉరుస్తున్న ఇళ్లలోనే జాగారం చేశామని మహిళలు వాపోయారు. తమకు ఇంటి పట్టాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని స్థానికులు ప్రభుత్వానికి విన్నవించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పేడు వైసిపి మండల అధ్యక్షులు కోనాటి రమణయ్య యాదవ్, కోబాకకు చెందిన చెంగ్రాయులతో కలసి జేసీబీతో కాలనీ సమీపంలో నీటికి దిగువనకు మళ్ళించారు.

తెగిన రింగ్ బండ్..

మండలంలోని జంగాలపల్లి వద్ద గతంలో తెగిన చెరువుకు రింగ్ బండ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెరువులోనికి వరద నీరు అధికంగా రావడంతో ఆ రింగ్ బండ్ కూడా కొట్టుకు పోయింది. గుడిమల్లం సీత కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆలయ దర్శనాలకు అంతరాయం ఏర్పడింది.

స్వర్ణముఖి ఉద్ధృతం

ఏర్పేడు మండలంలోని 14 గ్రామాల పరిధిలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గోవిందవరం, మోదుగుల పాలెం లో లెవెల్ వంతెనల వద్ద ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కుమ్మరి కండ్రిగ వద్ద కోన కాలువ, రాక్ మాన్ పరిశ్రమ వద్ద ఏటి కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అధికారులు రాకపోకలకు అంతరాయం ఏర్పడిన వలన కంచెలను ఏర్పాటు చేశారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి తన బృందంతో కొత్త వీరాపురం వద్దకు చేరుకుని స్వర్ణముఖి వరద ప్రవాహాన్ని పరిశీలించి, నదిలో వరద ఉధృతంగా ప్రవహించడం వలన రాకపోకలు సాగించరాదని హెచ్చరికలు జారీ చేసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వర్షాలకు జాగ్రత్తగా ఉండండి:సర్పంచ్ మోహనప్రియ

యండిపుత్తూరులో రోడ్లు వెంబడి వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో సర్పంచ్ మోహనప్రియ పారిశుధ్య కార్మికులతో వర్షపునీరు వెళ్లుటకు కాలువలు తీయించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : గూడూరు డిఎస్పీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎడతెరిపి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గూడూరు డిఎస్పి గీతా కుమారి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి మట్టం ఎక్కువగా ఉండే చెరువులు, వాగులు, నీటి గుంతలు దగ్గరికి పిల్లలను వెళ్లకుండా చూడాలన్నారు. తక్షణ సహాయం కోసం 112 సేవను ఉపయోగించుకోవాలన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: మట్టం శ్రావణి రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గూడూరు మండలం, చెన్నూరు, రామలింగయ్య కాలని, ఎస్టీ కాలనీల్లో రోడ్లపై నీరు నిలబడి ఇళ్లలోకి నీరు వస్తుండటంతో స్థానిక నాయకులు, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్ళడంతో, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి జె.సి.బితో నిల్వ నీటిని తొలగించారు.

ఉప్పొంగిన తలకోన జలపాతం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: భారీ వర్షాలకు తలకోన అటవీ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తలకోన నుండి జలపాతాలు ఉధృతంగా పొంగిపొర్లుతుండడంతో వచ్చిన వర్షపు నీరుతో చెరువులు నిండి కలకలలాడుతున్నాయి. తలకోన నీరు ప్రధాన రోడ్డు మార్గాల్లో పొంగిపొర్లుతుండడంతో మండల అధికారులు ఎస్ఐ బాలకృష్ణ, ఎంపీడీవో రాజు వంకలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం: నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో మండల స్థాయి అధికారులు వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) ఆదేశాల మేరకు రాయలచెరువు, అనుపల్లి చెరువు, బాదూరు చెరువు లను అధికారులు మండల టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ పరిశీలనలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సి జనార్దన్ చౌదరి, ఎన్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రాక పోకలు బంద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో గూడూరు పంబలేరు వాగుకు వరద నీరు చేరడంతో ముందస్తు చర్యల్లో భాగంగా గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, గూడూరు రూరల్ ఎస్ఐ తిరుపతయ్యలు కలిసి రోడ్డు మార్గాన్ని మూసి వేశారు. వరద ఉధృతి తగ్గే వరకు వాహన దారులు వెళ్లకూడదని సూచించారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలోఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాకాడు తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కొత్తపాలెం సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

మంగళం ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో లోతట్టు ప్రాంతమైన కేబీఆర్ నగర్‌లో వరద నీటికి శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం పరిధి ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో వాయుగుండం తీవ్రత వలన ఇబ్బందులు పడుతున్న కాలనీలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ, విద్యుత్ శాఖ ఏఈలతో వరదనీటికి సంబంధించి వర్షాలు తగ్గుముఖం పట్టగానే పూడికతీతతో పాటుగా కేబీఆర్ నగర్‌కు వరద నీరు వలన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరా సమస్య లేకుండా నూతన విద్యుత్ పోల్స్‌ను దృఢంగా ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక ప్రజలు ఇళ్ళు, రేషన్ కార్డులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరగా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపినాథ్, ఈశ్వరయ్య, విద్యుత్ శాఖ ఏఈ మోహన్, ఇరిగేషన్ శాఖ ఏఈ కవితా రెడ్డి, తిరుపతి రూరల్ మండలం డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్, తిరుపతి అర్బన్ తాహశిల్దార్ సురేష్ బాబు, వీఆర్వోలు సతీష్, నూతన కుమార్, పంచాయతీ కార్యదర్శులు మనోజ్ కుమార్, శశిభూషణ్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎగువగూలూరు రాకపోకల పునరుద్ధరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం తడుకు గ్రామపంచాయతీ, ఎగువ గూలూరుకు వెళ్లే మార్గం వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జిలో పూర్తిగా నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయమై ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సమస్య పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. వెంటనే స్పందించి ట్రాన్స్కో ఏఈ మోటార్లతో నీరు తోడేందుకు, త్రీఫేస్ కరెంటు ఇప్పించి, నీటిని బయటకు తీసివేసి రాకపోకలకు మార్గం ఏర్పాటు చేసారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - రేణిగుంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వరద నీరు అధికంగా చేరుతున్న రేణిగుంట వసుంధర నగర్, నక్కల కాలనీ ప్రాంతాలను బుధవారం సాయంత్రం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాలలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు.తుడా నుంచి కూడా అవసరమైన సహాయక చర్యలు అందిస్తామని హామీ ఇచ్చారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మల్లిమడుగు రిజర్వాయర్ పరిశీలన

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, మల్లిమడుగు రిజర్వాయర్‌ను ఇంచార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య పరిశీలించారు. డ్యామ్ నీటిమట్టాన్ని ఇరిగేషన్ అధికారుల సహకారంతో నీటిమట్టాన్ని పరిశీలించారు. నీటి చేరిక పెరుగుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్యాం నిండిన తర్వాత గేట్లు ఎత్తి వేసే సమయంలో కింది ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల పంట పొలాలు నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కళ్యాణి డ్యాంలో పెరుగుతున్న నీటి మట్టం

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, రంగంపేట సమీపంలో కళ్యాణి నదిపై నిర్మించిన కళ్యాణి డ్యామ్‌లో నీటిమట్టం పెరిగింది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కళ్యాణ్ డ్యామ్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతోంది. బంగాళఖాతంలో అల్పపీడనంతో ఏర్పడిన తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షానికి కళ్యాణీ డ్యాంలోకి శేషాచలం అడవి నుంచి వాగుల్లో నుంచి వరద నీరు ఉధృతంగా రావడంతో నీటి మట్టం పెరుగుతోంది. తుఫాను ముందు కళ్యాణీ డ్యాంలో 836 అడుగుల నీటి మట్టం ఉండేది. అయితే భారీ వర్షాలు కురుస్తున్నందున బుధవారం రాత్రికి 851 అడుగుల వరకు నీటి మట్టం పెరిగిందని అధికారులు తెలిపారు. డ్యాంలోకి శేషాచలం అడవుల్లోని రాగిమానుకొన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగులు నుంచి వరద నీరు డ్యాంలోకి వస్తుంది. దీంతో అధికారులు బుధవారం కళ్యాణి డ్యాంను పరిశీలించారు. వర్షాలు బాగా కురుస్తున్నందున నీటిమట్టం బాగా పెరిగే అవకాశం ఉంది. దీంతో కళ్యాణి డ్యామ్ వద్ద అధికారులు గేట్లలో ఎటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

పొంగిన వాగులు.. వంకలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాలకు వెళ్లే రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్పందించాయి. మండలంలోని లింగమనాయుడు పల్లి, కనపర్తి,పొయ్య,రౌతు సూరమాల తదితర గ్రామాలలో ఉన్న రైతులు ఇప్పటికే చేస్తున్న వ్యవసాయంలో గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్న రైతులకు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా నైరుతి రుతుపవనాల వల్ల కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు ప్రస్తుతం నాటిన వరి పైరు నీట మునిగిపోవడంతో తీవ్ర నష్టాల ఊబిలో కూరుకు పోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రోడ్లు గుంతల మయంగా మారాయి. మండలంలోని రౌతు సూరమాల, లింగమ నాయుడు పల్లి, బోనుపల్లి, చిట్టత్తూరు, కొత్త కండ్రిగ, పిల్లమేడు, కాసరం తదితర చోట్ల వాగులు వంకలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కోడూరు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతిలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు తిరుపతిలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్య పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలని నేరుగా తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు విన్న కోడూరు బాలసుబ్రమణ్యం సంబందిత అధికారులతో మాట్లాడి త్వరితిగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మరో 2 రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో, ప్రజలు అందరూ జాగ్రత్త వుండాలని , అత్యవసరం అయితేనే బయటకు రావాలని, వృద్ధులు చిన్నపిల్లలు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూటమి నాయకులు , ప్రభుత్వ అధికారులు ఎప్పటికిఅప్పుడు ప్రజలకి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుమూల్ మధు, నందకుమార్, ఐ ఎస్ కాజా తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన కైవల్యా నది

ప్రజాశక్తి - బాలాయపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కైవల్యా నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో నిండలి వద్ద ఉన్న కైవల్యా నది బ్రిడ్జి పైకి వరద నీటి ఉధృతి పెరిగింది. మండలంలోని నిండలి, వాక్యం, దగ్గవోలు గ్రామాలకు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ విజయలక్ష్మి నిండలి వద్ద కైవల్యా నది వరద ఉధృతిని పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని వీఆర్వో లకు సూచించారు.

వరద ప్రాంతాల్లో పర్యటించిన సిఐ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): గత నాలుగు రోజులుగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అతి భారీ వర్షాల కారణంగా గ్రామాల్లోని పలు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీని కారణంగా గ్రామాల్లో ప్రజల జీవనం స్తంభించిపోయింది. వాగులు వంకలు దాటే క్రమంలో ప్రజలు ఎక్కడ అపాయాన్ని కొనితెంచుకుంటారో అని తొట్టంబేడు మండల పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య బుధవారం కొన్ని ప్రమాదకరమైన పలు వాగుల దగ్గరికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగుల దగ్గర వరద నీరు ఉధృత తగ్గేంతవరకు గ్రామ ప్రజలు ఎవరు కూడా వాగులు దాటే ప్రయత్నం చేయకుండా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. చిట్టత్తూరు పంచాయతీ పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు వద్ద సహాయక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బలరాం తదితరులు పాల్గొన్నారు.

జయంపు చెరువు కలుజుకు తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి - బాలాయపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జయంపు చెరువు కలుజు వద్ద కోతకు గురైన విషయం తెలిసిందే. బుధవారం జల వనరుల శాఖ ఎ ఈ వెంకటేశ్వర్లు చెరువు కలుజు వద్ద మట్టి మూటలు నేటి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు.

నిరుపేదల పక్షపాతి శంకరన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నిరుపేదల అసమానతలు తొలగించడం కోసం, ప్రభుత్వ అధికార వ్యవస్థలను ప్రజలకు దగ్గరగా చేర్చి నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు ఐఏఎస్ గా ఎస్సార్ శంకరన్ తన జీవితం చివరి వరకు కట్టుబడ్డారని పలురు వ్యక్తులు కొనియాడారు. శంకరన్ 91వ జయంతిని బుధవారం తిరుపతి యూత్ హాస్టల్‌లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జీవకోన అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. విజయ్ కుమార్, టిటిడి ఎస్సీ ,ఎస్టీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ :ఎం, ప్రసాదరావు, యానాది సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాసులు, దళిత సీనియర్ నాయకులు దుగ్గాణి జయరాం పాల్గొని మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ఆర్థిక అసమానతులు తొలగి ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, భావించి తన అధికారాన్ని పేదలకు అందించి, దళిత ,ఆదివాసి హృదయాలలో స్థిర స్థాయిగా మిగిలిన ఏకైక ఐఏఎస్ అధికారి శంకరన్ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత గొడుగు చింత గోవిందయ్య, గెజిటెడ్ అధికారుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, బీసీ సంఘర్షణ సమితి గౌరవ అధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య, బీసీ నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య, భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షులు ధన శేఖర్, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, ఆర్.పి.ఐ జిల్లా అధ్యక్షులు ఏ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సాకం సుధాకర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి సుబ్బరాయుడు, టీటీడీ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తలారి మహేష్, తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం ఎస్ ఆర్ శంకరన్ విగ్రహాన్ని తిరుపతిలో ప్రతిష్టించడానికి ఓ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా పి .అంజయ్య, అక్కినపల్లి లక్ష్మయ్య, ,డాక్టర్ ప్రసాదరావు, ప్రసార కార్యదర్శిగా టీ విజయ్ కుమార్, కార్యదర్శిగా బుసగాని లక్ష్మయ్య, కోశాధికారిగా సాకం సుధాకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నారాయణలో ఏఐ డ్రైవెన్ నెట్‌వర్క్ సెంటర్ ప్రారంభం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరులో జూనిపర్ నెట్వర్క్స్ ఆధ్వర్యంలో ఆధునిక జూనిపర్ ఏఐ డ్రైవెన్ నెట్వర్క్ సెంటర్ అఫ్ ఎక్స్లెన్స్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళైమణి, ఏజీఎం, బీఎస్ఎన్ఎల్, . లక్ష్మి ఏజీఎం, బీఎస్ఎన్ఎల్, నాయుడు పేట, అతిథులు డాక్టర్ బి. దత్తాత్రేయ శర్మ డైరెక్టర్ ఎన్ ఇపిసి, డాక్టర్ కె.వి.ఎస్.రెడ్డి డీన్ (ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్) ఎన్ఇపిసి ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొని కొత్త నెట్వర్క్ వ్యవస్థను పరిశీలించారు.

క్రైం న్యూస్

ఆటోను ఢీకొన్న మినీ ట్రక్.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని పోటుపాలెం జంక్షన్ వద్ద ఆటోని మినీ ట్రక్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య కథనం మేరకు వెంకటాచలం మండల పరిధిలోని కసుమూరు గ్రామానికి చెందిన మల్లి రమణయ్య, తన ఇద్దరు కుమారులతో కలిసి నెల్లటూరు గ్రామానికి తన బంధువుల ఇంటికి ఆటోలో బయలు దేరారు. అదే మార్గంలో చెన్నై నుండి నెల్లూరుకి వెళ్తున్న మినీ ట్రక్ ఆటోను ఢీ కొనడం జరిగిందన్నారు. గాయపడిన వారిని చికిత్స కొరకు 108 ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. మూగజీవాలు బలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నోరులేని మూగజీవాలు కంచలేని ట్రాన్స్ ఫారం వద్దకు వెళ్లి షాక్ కొట్టి మృత్యువాత పడుతున్నాయి. గత వారం రోజుల నుంచి భారీ వర్షాలు కారణంగా ఆకలి తట్టుకోలేక పచ్చిక కోసం ట్రాన్స్ ఫార్మర్ సమీపంలోకి వెళ్లి విద్యుత్ షాక్‌తో బుధవారం ఒక ఆవు మృతి చెందింది. సంబంధిత లైన్ మ్యాన్ చూసి చూడనట్లు వ్యవహరించాడని స్థానికులు వాపోయారు. వివరాలలోకి వెళితే గూడూరు, సాదుపేట సెంటర్‌లో నివాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతమైనప్పటికీ విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ సేఫ్టీ గోడ కట్టేందుకు మెటీరియల్ అక్కడికి చేర్చడం, కొంతకాలమయ్యాక గోడ కట్టకుండానే మళ్లీ ఆ మెటీరియల్ తీసుకెళ్ళిపోవడం జరుగుతోంది. నివాసాల మధ్యనున్న ట్రాన్స్ ఫార్మర్ ఎత్తివేయా లంటూ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు మొరపెట్టుకున్న వాళ్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గోడ ఏర్పాట్లు చేయాలని, లేదా ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

పలు హోటళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆదేశాల మేరకు, బుధవారం శానిటరీ ఇన్స్పెక్టర్ మోహన్ కృష్ణ, అముదవల్లి, రెడ్డి ప్రతాప్, మునస్వామి, పుత్తూరు పురపాలక సంఘ పరిధిలోని హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించిన వారికి జరిమానాలు విధించారు.

ఎస్వీయూ భవిష్యత్ సైన్స్ సహకారంపై చర్చ

ప్రజాశక్తి - క్యాంపస్ : అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆచార్య నారాయణరావు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, ఉప కులపతి ఆచార్య తాతా నరసింగ రావును బుధవారం ఛాంబర్‌లో కలిశారు. సమావేశంలో ఇద్దరు విద్యావేత్తలు 2 ప్రతిష్టాత్మక సంస్థల మధ్య విద్య, పరిశోధన సహకారాలను బలోపేతం చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. భవిష్యత్ శాస్త్రీయ పురోగతి, స్థిరమైన ఇంధన పరిష్కారాల కోసం గుర్తించబడిన క్వాంటం టెక్నాలజీస్, హైడ్రోజన్ మొబిలిటీలో ఉమ్మడి పరిశోధన చొరవలను చేయడానికి చర్చలు జరిపారు. అధ్యాపకుల పరస్పర సహకారం, ఉమ్మడి పరిశోధన ప్రతిపాదనలు, పరిశ్రమల నిపుణులతో కూడిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ల నిర్వహణ వంటి అంశాల అవగాహనతో సమావేశం ముగిసింది.

ప్రపంచ స్థాయి పోటీకి అనుగుణంగా
ఎస్వీయూ ఇంజనీరింగ్ సిలబస్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆచార్య తాతా నరసింగరావు బుధవారం తన ఛాంబర్‌లో యస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్, వైస్–ప్రిన్సిపాల్, డీన్, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు. పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ ,టైమ్‌టేబుల్, ప్లేస్‌మెంట్ వంటి కార్యకలాపాలపై దృష్టి సారించారు. అత్యాధునిక సాంకేతిక పరివర్తన జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఇంజనీరింగ్ విద్య ప్రపంచ వ్యాప్తంగా డైనమిక్‌గా మారిందని, దాన్ని మనం అందుకోవాలని విసి చెప్పారు. జాతీయ విద్యా విధానం అనుగుణంగా ఉండేలా చూసుకోవడం ద్వారా విభాగాలు తమ సిలబస్, ల్యాబ్ , మౌలిక సదుపాయాలు, బోధనా పద్ధతులను కాలానుగుణంగా సమీక్షించాలని విసి ఆదేశించారు.

అంతర్జాతీయ సదస్సులో
ఎన్.ఎస్.యు అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కుమార్ బాగేవాడిమఠ్ ఇండోనేషియాలోని బాలిలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. గ్లోబల్ సంస్కృత ఫోరం, భారత్, ఐజిబి సుగ్రీవా స్టేట్ హిందూ యూనివర్సిటీ, డెన్‌పసర్, యాయాసన్ ధర్మ స్థాపనం, ఇండోనేషియాతో కలిసి ఈ సదస్సు నిర్వహించబడింది. "సమకాలీన విద్య వర్సెస్ ప్రాచీన భారతీయ విద్యా వ్యవస్థ: తులనాత్మక విశ్లేషణ" అనే అంశంపై డా.కుమార్ ఒక ప్రెజెంటేషన్ ఇచ్చారు. భారతీయ జ్ఞాన వ్యవస్థను మరియు సంస్కృతం జ్ఞానానికి ఎలా గమ్యస్థానంగా ఉందో ఆయన వివరించారు. ఆధునిక విద్యా వ్యవస్థకు పురాతన అభ్యాస పద్ధతులను ఎలా స్వీకరించాలి మొదలైన వాటిపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ ప్రొ కృష్ణమూర్తి ఆయన కృషిని అభినందించారు. ఎన్ఎస్‌యు అధికారులు, అధ్యాపకులు కుమార్‌ను అభినందించారు.

In The Court of the principal Senior Civil Judge (Senior Division), Tirupati
Succession OP No. 4/2025
Sai Sudharshan S/o Late P.V.Arunachalam Aged about 62 years R/o D.No.526, Balaji Colony, Union Bank Street No.1, Tirupati & 2 Others ..Petitioners
V/s
The Senior Superintendent, Head Post office holding office at Tirupati Head Post Office, P.K. Layout, Tirupati ...Respondent
జనరల్ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! నా క్లయింట్స్ 1) పి.సాయిసుదర్శన్ 2) పుదూరు పతాంజలి సాయి తండ్రి లేట్ పి.వి.అరుణాచలం 3) అనురాధ సాయి రవీంద్రన్ తండ్రి లేట్ పి.వి.అరుణాచలం అనుమువ్వురు కలిసి తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో కేసును దాఖలు పరచి వారి తండ్రి గారు పి.వి.అరుణాచలం @ పి.వి.అరుణాచలం పేరుతో తిరుపతి హెడ్ పోస్టాఫీసులో డిపాజిట్ కాబడిన రూ.6,37,736/-లను ఐ.డి.నెం. 0538906252గా ఉన్న అకౌంట్‌లో మొత్తం నగదును పై వారలే వారసులుగా ధృవీకరించి తీసుకొనుటకు దాఖలు పరచిన పిటీషన్ నందు ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది. 20.11.2025 ఉదయం 10.30 గం॥లకు నేరులో గాని లేక వకీలు ద్వారా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల పరోక్షముగా తీర్మాణించబడును.
వాయిదా తేది. 20.11.2025
వేలూరు జి.గణేష్
అడ్వకేట్, తిరుపతి

వర్షాలపై ముందస్తు చర్యలు

నాయుడుపేట, కలవకూరు డ్యామ్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ : అల్పపీడన ప్రభావంతో తిరుపతి జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణ స్పందన ఇవ్వడానికి జిల్లా పోలీస్ శాఖ పూర్తిస్థాయి సిద్ధతతో ఉంది. ఇందుకోసం ప్రత్యేక బృందాలు, కంట్రోల్ రూమ్లు ఎల్లవేళలా పనిచేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎస్పీ సూచనలు

భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను స్వయంగా జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు, నాయుడుపేట, కలవకూరు డ్యామ్ పరిసర ప్రాంతాలను పర్యటించి సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి, తక్షణ చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. వాగులు, వంతెనలు, చెక్డ్యాంల వద్ద 24 గంటల పహారా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా పహారాలను బలోపేతం చేయాలన్నారు. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలినచో వెంటనే తొలగించాలన్నారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ వాహనాల ద్వారా మైక్ ప్రకటనలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కిల్, స్టేషన్ స్థాయిలో పోలీస్ సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రధాన చర్యలు..

నదులు, వాగులు, చెరువుల వద్ద పికెట్లు ఏర్పాటు చేసి రాత్రి-పగలు నిరంతర గస్తీ నిర్వహించాలి.

లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలి.

వరదల తీవ్రత, రహదారుల పరిస్థితి, ప్రజలు చిక్కుకుపోయిన ప్రాంతాలపై నిఘా కోసం డ్రోన్ సేవలు సిద్ధంగా ఉంచాలి.

రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం కొనసాగించాలి.

పిడుగుపాట్లు సంభవించే అవకాశం ఉన్నందున చెట్ల కింద నిలబడరాదుబీ వ్యవసాయ పనుల సమయంలో జాగ్రత్తలు పాటించాలి.

తీరప్రాంత ప్రజలు పోలీస్, రెవెన్యూ శాఖ సూచనలను పాటించి అవసరమైతే తుఫాన్ షెల్టర్ కేంద్రాలకు వెళ్లాలి.

ఈదురుగాలులు, వర్షాల కారణంగా చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు కూలినప్పుడు సంబంధిత శాఖలతో సమన్వయంతో వెంటనే తొలగించాలి.

ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలి.

వాగులు, వంకల్లో ఈత కొట్టడం, చేపలు పట్టడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడరాదు.

శిథిలాలను తొలగించేందుకు జెసిబిలు, ప్రొక్లెయిన్లు, రెయిన్ కోట్లు, తాళ్లు, అత్యవసర లైట్లు, బ్యాకప్ పవర్ వనరులు సిద్ధంగా ఉంచాలి.

ఉబ్బలమడుగు డ్యాం పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కురుస్తున్న టువంటి భారీ వర్షాల కారణంగా బుధవారం ఉదయం బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దార్ శ్రీదేవి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలత్తూరు వద్ద ఉన్న వంది కాలువ వర్షంతో పొంగి పొర్లడంతో రెవెన్యూ సిబ్బంది, సచివాల సిబ్బంది వాగుకు ఇరువైపులా ఇరువైపులా ముళ్ళ కంచె ఏర్పాటు చేశారు. అనంతరం మండలంలోని ఉబ్బలమడుగు డ్యామ్ను పరిశీలించారు. ఆ డ్యాము పురాతనమైనది అయినందున తెలుగుగంగ ఏఈకి సమాచారం అందించి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత తెలుగు గంగ సిబ్బందిపై ఉందని ఆమె తెలియజేశారు. అంతేకాకుండా వాహనదారులకు గ్రామస్తులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక గాంధీ రోడ్ లోని ఆ సంస్థ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయల్ మాట్లాడుతూ తమ సమస్య ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా జాతీయ నాయకులు, ప్రముఖులు ప్రముఖుల పుట్టినరోజులు సందర్భంగా, ఇతరత్రా ముఖ్య పర్వదినాల రోజు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మానవసేవే మాధవసేవ నినాదంతో తమ వంతు కృషిలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సుమారు 1000 మంది పేదలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, బండి మధుసూదన్ రెడ్డి, ఆ సమస్త సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

టిడిపి నాయకులు పేరం నాగరాజు నాయుడు

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని మోదుగులపాలెం స్వర్ణముఖి కాజ్వే, సీతారాంపేట చెరువు కలుజు, ఆమందూరు చెరువు మరియు ఏర్పేడు సైడ్ కాలువలను మండల టిడిపి నాయకులతో కలిసి అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరు బయటకు రావద్దని, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందువలన దాటే ప్రయత్నం చేయరాదని విజ్ఞప్తి చేశారు. సూరి నాయుడు, కృష్ణవేణి, రాచేటి సుబ్రహ్మణ్యం సర్పంచ్ బాల గురునాథం యాదవ్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరమైతేనే మంచి భవితవ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి మహిళా పోలీసు శక్తి టీం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తమీమ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో నేటి పరిస్థితుల గురించి, చుట్టూ జరిగే పరిణామాల గురించి అవగాహన కలిగివుండాలని, నైతిక విలువలు పెంపొందించుకోవాల్సిన బాధ్యత, ఇతరులతో మెలగ వలసిన తీరును, ప్రతి వ్యక్తి జీవితంలో ఏర్పరచుకోవాల్సిన లక్ష్యాలు, వాటిని చేరుకోవడానికి శ్రమించి కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో చదువు అవసరం, బయట ప్రపంచంలో పోటీని ఎలా తట్టుకోవాలి, భవిష్యత్తు పట్ల అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని గుర్చి తెలిపారు. సైబర్ క్రైమ్, లోన్ యాప్స్, బెట్టింగ్ యాప్స్, అపరిచిత వాట్సాప్ వీడియో కాల్స్, అన్నోన్ లింక్స్ ని క్లిక్ చేయడం, ఫైనాన్షియల్ ఫ్రాడ్, చైల్డ్ పోర్నోగ్రఫీ, చూడడం, ఇతరులకు షేర్ చేయడం నేరమని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, వెంట పడడం చేసినట్లయితే అందుగల శిక్షల గురించి, మత్తు పదార్థాలు సేవించినట్లయితే అందుకు గల శిక్షలు, ఆరోగ్య సమస్యల పర్యవసనాలు, ట్రాఫిక్ నియమాలు, డిజిటల్ అరెస్ట్, పోక్సో చట్టం గురించి తెలిపారు. చెడు వ్యసనాలకు దూరమైతేనే ఉన్నత లక్ష్యాలు సాధించగలరని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను మంచికి వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోహిణి, ఏ ఎస్ ఐ, సుశీల, పార్వతి, మహిళా హెడ్ కానిస్టేబుల్, పూర్ణిమ, ఆశ, స్వప్న పోలీసు కానిస్టేబుల్స్, అధ్యాపకులు, పి. ప్రియవర్ధన బాబు, కె. కృష్ణ కిషోర్, డా. సి.ఎల్. చెన్నా రెడ్డి, డా. పి. ప్రసాద్, ఎమ్.యశోధ, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా సిబ్బందిని అప్రమత్తం చేసిన ఎంపీడీవో

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎం సాయి ప్రసాద్ జమీన్ కొత్త పాళెం సచివాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు భారీ వర్షాలు, తుపాను దృష్ట్యా ఎంపీడీవో సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని ప్రజలకి ఏమైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు వెంటనే సహాయ సహకారాలు అందించవలసిందిగా అతి భారీ వర్షాల దృష్ట్యా ప్రమాదం కారణంగా ఇల్లు లేని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎటువంటి పరిస్థితుల్లో కూడా ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని, నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షం అనంతరం ఎదురయ్యే సమస్యలపై సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అధిక వర్షం తగ్గేవరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఆర్ఐ అఖిల్, వీఆర్వో, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో పంటల్లో యాజమాన్య పద్ధతులు

ప్రజాశక్తి - క్యాంపస్ : గత కొన్ని రోజుల నుండి కురుస్తున్న వర్షాల ప్రభావం వలన పంటలకు నష్టం జరగకుండా ఉండడానికి ఈ క్రింద తెలిపిన చర్యలు పాటించాలి. వేరుశనగ పంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశ నుండి కోత దశ వరకు ఉంది. సాధ్యమైన చోట పొలాల నుండి అదనపు నీటిని వెంటనే తీసివేయాలి. తీసేసిన పంట పొలం మీద ఉన్నట్లైతే చెట్లను గట్టు మీద పెట్టినట్లైతే తడిచిన చెట్ల మీద ఉన్న నీరు పోయే అవకాశం ఉంది. 65-70 రోజుల పంటను ఆకుమచ్చ తెగులు మరియు తుప్పు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి వర్షం తగ్గిన వెంటనే టెబుకోనజోల్ 200 మి.లీ లేదా హెక్సాకొనజోల్ 400 మి.లీ ఎకరాకు పిచ్చికారి చేసుకోవాలి. పంట కోతకు సిద్ధంగా ఉన్న చోట వర్షాలు ఆగేవరకు పంట కోత ఆలస్యం చేయాలి. కంది పంట ప్రస్తుతం పూతకు వచ్చే దశలో ఉన్నది. ఈ దశలో పొలంలో నీరు నిలబడినట్లైతే వేరుకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది. కావున పొలంలో నీరు నిల్వ ఉండకుండా తీసివేయాలి. వర్షం ఆగిన తర్వాత ఈ పంటకు ఎండు తెగులు సోకకుండా ట్రైకోడర్మా విరిడి 10 గ్రా లేక కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళు తడిచేలా పోసుకోవాలి. వరి నారుమళ్ళలో త్వరగా పుంజుకోవడానికి 5 సెంట్లు నారుమడికి 1 కిలో యూరియా ం 1 కిలో మ్యూరేట్ ఆఫ్ పోతాష్ పైపాటుగా వేయాలి. తర్వాత లీటరు నీటికి 2 గ్రా కార్బెండజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారి చేయాలి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో గింజలు మొలకెత్తకుండా లీటరు నీటికి 20 గ్రా ఉప్పు కలిపి పిచికారి చేయాలి. కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉంటే వేరు కుళ్ళు, కాండం కుళ్ళు వస్తాయి. వెంటనే నీరు బయటకు పోయేలా ఏర్పాటు చేయాలి. తెగుళ్ళ నివారణ కు గాను కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రా లేదా మాంకోజెబ్ ఏ2.5 గ్రా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసు కోవాలి. ఆకు తినే పురుగులు, తామర పురుగులు, తెల్ల దోమ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వర్షము ఆగిన తర్వాత పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ (0.3 మి.లీ./లీ.) లేదా థయోమేథాక్సమ్ (0.25 గ్రా./లీ.) పిచికారీ చేసుకోవలెను. పండ్ల తోటల్లో మట్టి నీటిని తొలగించండి. వేర్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా చేయండి. నీటి నిల్వ వల్ల వేర్లు కుళ్ళిపోతాయి. పండ్ల తోటల సంరక్షణ కొరకు దెబ్బతిన్న కొమ్మలను తొలగించండి. మాంకోజెబ్ ం కార్బెండాజిమ్ ఏ 2.5 గ్రా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కపిలేశ్వరాలయంలో హోమాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం గణపతి హోమంతో విశేషపూజ హోమ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజుల పాటు హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. గణపతి హోమం చేయడం వల్ల జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగుతాయని అర్చకులు తెలిపారు.